# బ్రతుకు బండి

కాకాని కమల



ఊరికి కాస్త పెడగా బస్టాండు దగ్గర విశాలంగా విస్తరించుకొని ఊడలు దిగి ఉంది మర్రిచెట్టు. శాయిలు గుర్రం లేని బండిని పక్కకి దింపి చెట్టుకి ఆనుకుని దిగాలు పడి కూర్చున్నాడు.

ఇంకొక అరగంటలో అట్నుంచి పట్నం నుండి బస్సు వస్తుంది. ఇట్నుంచి పట్నం పోయే బస్సు వస్తుంది. ఇవికాక చుట్టుప్రక్కల గ్రామాల నుంచి అరకొరగా ఏవో వ్యాన్‌లు తిరుగు తూ ఉంటాయి.

ఈ నంవంగల గ్రామానికి ఈ మధ్యనే సర్కారు బస్సు రూటు వచ్చింది. కాని ఊరికి చాలా దూరంగా మెయిన్‌రోడ్డు దగ్గర ఆగుతాయి బస్సులు. అక్కడ్నుంచి చుట్టుప్రక్కల ఏ మూల గ్రామాలకి వెళ్ళాలన్నా నాలుగైదు కిలోమీటర్లకి తక్కువ కాకుండా నడవాల్సిందే. లేదూ ఎద్దుబండో, గుర్రంబండో ఎక్కాల్సిందే. బస్సులు సరి అయిన టైంలో రావు. వానాకాలం వచ్చిందంటే అసలు రావు. మంచి రోడ్డు లేదు...సడెన్‌గా బస్సులు క్యాన్సిల్ చేస్తారు. ఇంక ఇరుగుపొరుగు గ్రామాలకి మంచికి చెడుకి ఎక్కడికి వెళ్ళాలన్నా గుర్రం బండో ఎద్దుబండో కట్టుకుని వెళ్ళాల్సిందే. ఆ గ్రామాలని చూస్తే ఇంకా ఎంతమాత్రం నాగరికత అంటని ఊళ్ళు ఉన్నాయా అన్న ఆశ్చర్యం కలుగక మానదు. ఆ చుట్టుప్రక్కల గ్రామాలకి గుర్రబళ్ళు బాగానే తిరుగు తాయి.

అక్కడికి దగ్గర ఒక మిషనరీ ఆసుపత్రి వుంది. టూరింగ్ టాకీసుంది. చుట్టుప్రక్కల గ్రామస్తులు ముఖ్యంగా ఆడాళ్ళు పిల్లలు గుర్రబళ్ళు మాట్లాడుకుని వెడతారు. గ్రామస్తులందరూ వ్యవసాయదారులు. చాలామందికి ఎద్దుబళ్ళు ఉన్నాయి. కాని వానాకాలం ఆ బండి నడక కష్టం.

నంవంగ పల్లి కే కాదు. ఆ చుట్టుప్రక్కల గ్రామా లకి నగం దార్లు ఎర్రమట్టి రోడ్డు,మిగతా సగం రాళ్ళు రప్పల మయం. మట్టి రోడ్డున ఎడ్లబండి నల్లేరు నడకలా సాగిపోతోంది. కాని రాళ్ళ దారిన కుంటు పడుతుంది. అయితే గుర్రం బండికి ఆ బాధ లేదు. రాళ్ళురప్పల గోతులు చిన్న నీటి కుంటలు సునాయాసంగా దాటుకుంటుంది.

గతంలో శాయిలు గుర్రం బండికి బోల్డంత గిరాకి వుండేది. ఊళ్ళో ఆడంగులు ఎటైనా పక్కగ్రామానికి వెళ్ళాలంటే ముందుగానే శాయిలుకి కబురెట్టి మాట్లాడుకునేవారు. ఇరుగుపొరుగ్గు ఊళ్ళల్లో వాళ్ళ బందువుల్లో పెళ్ళిపేరంటం అయినా సినిమాకి పోవాలన్నా తిరణాలు చూడాలన్నా ముందు రోజే శాయిలు

[illegible] బయానా ఇచ్చి మరీ వెళ్ళేవారు.

శాయిలుకి నెలంతా ఏదో ఒక గిరాకీ తగులుతూనే ఉండేది. డబ్బుకి ఇబ్బంది లేకుండా జీవితం సాఫీగా గడిచిపోయేది. కానీ వున్నట్టుండి [illegible] కుంటు పడింది. గుర్రానికి వాతం రోగం కమ్మి పది రోజులు తీసుకుని చచ్చిపోయింది. శాయిలా పని చేసిన గుర్రం, వయసు గుర్రం. గుర్రం చనిపోవడంతో శాయిలు బ్రతుకు కుంటుపడింది. బండి నడపడం తప్పించి వేరే పని తెలియదు శాయిలుకి. వేరే ఏ వృత్తి చేపడదామన్నా అంతా అయోమయం. శాయిలు తాతముత్తాతలు జమీందార్ల గుర్రం శాలల్లో పని చేసేవారు. శాయిలు తండ్రికి జమీందారు గుర్రం బహూకరించాడు. అది అరబ్బీ గుర్రం. తండ్రి ఆ గుర్రం బండి నడిపించేవాడు. తండ్రి చనిపోయేనాటికి అది కూడా ముసలిది అయ్యింది. శాయిలు తండ్రి శాయిలుకి ఇంకో మంచి గుర్రం కొనిచ్చాడు. తండ్రి పోయాక ఆ గుర్రంతో బండి నడిపించుకుంటూ బ్రతుకుతున్నాడు శాయిలు. ఆ చుట్టుప్రక్కల పల్లెలన్నీ చిన్నవి. సర్కారు బస్సుల సౌకర్యం లేదు. మంచి రోడ్లు లేవు. ఇసుక పర్రలు, లోతు కుంటలు,ఎర్రమట్టి, బంకమట్టి నేలలు. ఆ ప్రాంతం అంతా వ్యవసాయ క్షేత్రాలే.

ఈ మధ్యనే ఊరి చివర హైవే దగ్గర అటు ఇటు రోడ్డు పడింది. ఒకటి అరగా సర్కారు బస్సులు, వ్యానులు తిరగటం మొదలెట్టాయి.

అయితే వానాకాలం ఏ బస్సులూ తిరగవు. కారణం వాగులు వంకలు పొంగిపొర్లుతాయి. చెరువుల అడ్డుకట్టలు తెగి పడతాయి. బంకమట్టి పెళ్లలు ఎక్కడ పడితే అక్కడ బీటలు వేస్తాయి. బస్సులు వస్తే కూరుకుని పోతాయి. అందుకే వానాకాలం బస్సులు తిరగవు.

ఆ కాలంలో గుర్రం బళ్ళకి ఇంకా గిరాకి ఎక్కువ. శాయిలుకి చేతినిండా పని వుండేది. పగలు రాత్రి సవారీలు దొరికేవి. జేబునిండా డబ్బులు గలగలలాడేవి. సంసారం పెద్దదయినా హాయిగా సాగిపోయేది. కాని ఇప్పుడు శాయిలు బ్రతుక్కి గండిపడినట్లు అయ్యింది. మంచి వయసు గుర్రం హఠాత్తుగా మరణించడంతో దిక్కు తోచటం లేదు. ఇంకో గుర్రం కొనే శక్తి లేదు శాయిలుకి. ఏదో కాడికి ఎద్దుని కొని బండికి కడితే బండి సాగుతుందేమో కాని మునుపటిలా ఇబ్బడిముబ్బడిగా బేరాలు రావు. ఊళ్ళో చాలా మంది సేద్యకారులే. వాళ్ళందరి దగ్గర ఎడ్ల బళ్ళు ఉన్నాయి.

ఊళ్ళో ఎద్దుబండి బాడుగకి తిప్పేవాళ్ళని చూస్తూనే వున్నాడు. ఎద్దుకి తిండి దండగ అని వాపోతున్నారు. దిక్కు తోచడం లేదు శాయిలుకి.

## ఇందిరగా మనీషా

మనీషా కొయిరాలా కేవలం గ్లామర్ రోల్స్‌కే పరిమితం కాకుండా, పెరఫార్మెన్స్ పాత్రలు కూడా చెయ్యగలనని నిరూపించుకునే ప్రయత్నంలో ఉంది. దానిలో భాగంగానే గదర్ నిర్మాత నితిన్ కేనీ చిత్రంలో మనీషా కొయిరాలా తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ పాత్రను పోషించనుంది. ఈ చిత్రానికి తేజాబ్ దర్శకుడు ఎన్. చంద్ర దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమా హిట్ అయితే కాంగ్రెస్ పార్టీవారు మనీషాను వచ్చే ఎన్నికల్లో రాజకీయాల్లోకి లాగే ప్రయత్నం చేసినా చెయ్యగలరు.



గుర్రం చచ్చిపోయి రెండు నెలలు దాటుతుంది. అయినా అలవాటుగా నిత్యం బస్టాండుకి వస్తూనే వున్నాడు. ఊళ్ళోకి పోవటానికి ఎవరో ఒకరు పట్నం బస్సు దిగుతూనే వున్నారు. పాసింజర్స్ దిగగానే బళ్ళవాళ్ళందరూ వాళ్ళ చుట్టుమూగుతారు. తన చుట్టూ మూగిన ఆ బాడుగ బండి వాళ్ళని "గుర్రంబండా? ఎద్దు బండా?" అని అడుగుతారు.

ఎద్దుబండి అనగానే వెనక్కి తగ్గుతారు. ఓ రూపాయి ఎక్కువైనా వెనకాడకుండా గుర్రం బండి బాడుగ కుదుర్చుకుంటారు.

గుర్రం బళ్ళు లేకపోతే విధిలేక ఎద్దుబండి ఎక్కుతారు. ఆ చుట్టు ప్రక్కల గ్రామాలకి 4, 5 కంటే ఎక్కువ గుర్రబళ్ళు లేవు. వాటికే గిరాకి. ఎప్పుడూ వుంటూనే వుంటుంది. ఎద్దు బళ్ళ వాళ్ళకి పడిగాపులు తప్పవు. అడపాదడపా ఏవో బేరాలు దొరుకుతూ ఉంటాయి. కాని ఇప్పుడు శాయిలు పరిస్థితి రెండింటికి చెడ్డ రేవడిలా వుంది.

శాయిలు బండికి ఎద్దు లేదు. గుర్రం లేదు. కొత్త గుర్రం కొనే శక్తి లేదు. ఎద్దుని కొనాలన్నా మాటలా? మంచి ఎద్దు కావాలంటే నాలుగు వేలన్నా కావాలి. ఒంగోలు గిత్తో, మైసూరు గిత్తో అయితే బాగా పరిగెడతాయి. మిగతావన్నీ తిండి దండగ.

పూలమ్మిన చోట కట్టెలు అమ్మినట్లు అరబ్బీ గుర్రంతో నడిపి ఎద్దుని ఆ స్థానంలో కట్టాలంటే బాధగా వుంది శాయిలుకి. ఎద్దు బురదలో దిగబడిందంటే మహా యాతన. గుర్రం అయితే గుంటలు, గుట్టలు, వాగులు, వంకలు చెంగున దాటేస్తుంది. చక్రం వంకలో దిగబడ్డా కొరడాతో చెళ్ళుమనిపిస్తే గుర్రం తారాజువ్వలా పైకి లేస్తుంది. గుర్రం బండి నడపడం అంటే విమానంలా గాలిలో తేలటమే. ఆ బంక బురదగుంటల సేద్యపు నేలలకి గుర్రం అయితే అనువుగా వుంటుంది. ఆ సుఖం తెలియబట్టే ఎద్దుని కొనటానికి వెనకాడుతున్నాడు శాయిలు. పైగా చేతిలో చిల్లిగవ్వలేదు. ఎక్కడున్నా అప్పు తెచ్చి ఎద్దుని కొనాలి. బేరం సాగకుండా అప్పు ఎలా తీరాలి?

అదీ సమస్య.

అందుకే శాయిలు బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. కొన్నాళ్ళు మనిషి సవారి వెయ్యాలనుకున్నాడు.

కలకత్తాలో నేటికీ టాంగాలని మనుష్యులే లాగుతారు. డబ్బు కూడేసి ఇంకో గుర్రాన్ని కొనే దాకా, తన రెక్కలతోనే బండిని లాగాలి అని నిర్ణయించుకున్నాడు. కానీ- అదీ కుదరలేదు.

"గుర్రమా....ఎద్దా?" అని అడిగేవారు.

"రెండూ కాదు బాబూ. నేను లాగుతా"అనగానే "మనిషి సవారా? వద్దు నాయనా!" అనేవారు.

"గుర్రంతో సమంగా పరిగెడతా సామి. నాకు అలవాటే" అంటే "నీకు అలవాటు కావచ్చు. కాని నాకు అలవాటు లేదు. యంత్రాలు పని చేస్తున్న కాలంలో సాటి మనిషి రెక్కలతో లాగుతుంటే నేను బండిలో కూర్చోలేను. నా మనసు ఒప్పదు" అంటున్నారు.

బండి ఎక్కటానికి సిద్ధపడి మనిషి సవారి అనగానే దిగిపోయేవారు. "ఎద్దునో గుర్రాన్నో తెచ్చి బండి నొగకి కడతావనుకుంటున్నానయ్యా ఇంకానా. భలేవాడివేలే. నువ్వు లాగుతావా?" అంటూ వెళ్ళిపోతున్నారు. వెనక్కి తిరిగి కూడా చూడటం లేదు.

శాయిలుకి కళ్ళనీళ్ళు వస్తున్నాయి. యంత్రం కంటే, జంతువులకంటే, మనిషి శక్తికి విలువ లేదా? అనిపిస్తుంది.

జంతువుతో గొడ్డు చాకిరి చేయించుకుని, నాలుగు గడ్డి పరకలు, కుడితి పెడుతున్నాం.

యంత్రంతో పని చేయించుకుని దానికి ఆయిల్ పోస్తున్నారు. "కాని మనిషి ఆకలిని గుర్తించటం లేదు ఎవరూనూ" ఆవేదనగా అనుకున్నాడు శాయిలు అరచేత్తో ఎండిన డొక్కల్ని తడుముకుంటూ! ❋